


# అద్దం అబద్ధమాడింది

పాలడుగు వెంకటేశ్వరరావు

ముగ్గురన్నల తర్వాత పుట్టి ముద్దు ముద్దుగా పెరిగింది మాధురి. తల్లిదండ్రులకి ఒక్కతే కూతురు. పైగా చిన్నప్పుడే రబ్బరు బొమ్మలాగ ముద్దొస్తూ ఉండేది. అన్నలు ఇంట్లో ఉన్నంతసేపు కిందకి దించేవాళ్ళు కాదు. తల్లి సంగతి సరేసరి. రోజుకి నాలుగు సార్లు కూతురికి దిష్టి తీసేసేది. తండ్రి దగ్గర ఆ పిల్ల ఒక్కదానికే చనువు. మిగతావాళ్ళందరూ ఆయనకి దూరదూరంగా మసిలేవారు. ఆ విధంగా ఆ ఇంట్లో వాళ్ళందరికి ప్రాణసమానంగా పెరిగింది మాధురి.

పెరిగి పెద్దదవుతూన్నకొద్దీ మాధురి మనసూ ఎదగసాగింది. కాని-గర్వం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. పైగా అది పెరిగింది. అందుకు కారణం తన అందమే అని మాధురి అనుకుంది. కాని

వాస్తవానికి అనేకమయిన కారణాల్లో అది ఒకటి మాత్రమే.

ఆ రకంగా మాధురి అనుకోవటానికి దృష్టాంతాలూ లేకపోలేదు. స్కూల్లో, ఆమె కొలీగ్సు ఆమెని ఆరాధించేవారు. "నువ్వు అలాగ ఉన్నావు; ఇలాగ ఉన్నావు" అంటూ ఆ కాలంలో ప్రసిద్ధులయిన సినీతారలతో ఆమెని పోల్చి, మాధురి వాళ్ళకంటే కూడ నిజంగా అందంగా ఉందని అనేవారు. ఆడపిల్లవే అలాగ అంటే ఇక మగపిల్లల సంగతి చెప్పనవసరంలేదు. కాని మాధురి నోటికో, ఆమె తండ్రి పరపతికో జడిసి వాళ్ళు దూరంగానే మసలుకొనేవారు.

ఆ రోజుల్లో మాధురి రోజుకి అరడజనుసార్లయినా అద్దం ముందు కూర్చుని – తన నునుపైన చెంపల్నీ, నల్లని ఉంగరాల జుత్తునీ, తామర పూరేకులవంటి, పెద్దజాతి చేపల్లాంటి తెలికన్నుల్నీ, పల్చని అందమయిన ఎర్రటి పెదాల్నీ, నునుపైన మెడనీ సంపెంగ పూవువంటి ముచ్చటయిన ముక్కునీ, తీర్చి దిద్దబడుతూ ఉన్న అవయవ సౌష్ఠవాన్నీ. అందానికి నిర్వచన వనదగ్గ తన శరీర లావణ్యాన్నీ తనివిదీరా చూసుకొనేది కష్టపడి ఓపిగ్గా ఆ అందానికి మెరుగులు దిద్దుకొనేది.

ఇంట్లో మాధురి మాటకి ఎదురు లేదు. కావాలన్నప్పుడు కొండమీద కోతి అయినా దిగి వచ్చేది. మాధురి వాగ్ధాటికి ఇంట్లో అందరూ తల వంచే వారు. అది ముద్దుల చెల్లెలిమీదా, కూతురిమీదా వాత్సల్య రూపంలో, అభిమాన రూపంలో ప్రకటింపబడుతూ ఉండేది. కాని ఇతరుల దృష్టిలో ఆమె గయ్యాళిగానే పరిగణింపబడింది. ఆమె తీరే అంత. అది మారనూలేదు.

మాధురి బి.ఏ. చదువుతూ ఉండగా–ఆమెని వలచి ఎందరో మంచి మంచి వరులు పెళ్ళిచేసుకోవటానికి ముందుకు వచ్చారు. కాని ఏదో కారణంవలన అందరూ తృణీకరింపబడ్డారు. అలాగ అనేకసార్లు జరిగి ఆమె అన్నలూ, తండ్రీ నిరాశా, నిస్పృహలకి లోనవగా–ఆమె బి ఏ. పూర్తిచేసినప్పుడు చిత్రంగా మాధురే ప్రేమలోపడింది.

మోహనరావు కాలేజి లెక్చరరు. స్ఫురద్రూపి. అయితే అతని స్వభావం మాధురి స్వభావానికి పూర్తిగా భిన్నమైనది. తన పని తాను చేసుకుంటూ మౌనంగా పోయేవాడు. పెద్దమనిషిగా పరిగణన పొందాడు, అప్పుడే.

మాధురిని తనకి ఇచ్చి వివాహం చేస్తామని ఆమె తండ్రి వచ్చి చెప్పినపుడు అతను ఆశ్చర్యపోయేడు. కలెక్టర్లు ఎస్.పి.లు కాబోయే వాళ్ళనందర్నీ కాదని ఈ పిల్ల తనని కోరు

కోవటం అతనికి అద్భుతంగానే అన్పించింది.

కాని ప్రేమ గుడ్డిది. పైగా పిచ్చిది కూడా నని అతనికీ తెల్సు. పైగా మాధురి తనని తప్ప వేరెవర్నీ వివాహ మాడనంటున్నదని తెలిసాక, అతను ఆ అమ్మాయిని క్రూరంగా నిరాకరించ లేకపోయాడు. అలాగ మాధురికీ, మోహనరావుకీ అట్టహాసంగానే పెళ్ళయి పోయింది.

పెళ్ళయి వేరుకాపురం పెట్టుకున్నాక ఆ అద్దాన్ని తనతో తీసుకుపోయింది మాధురి. అది మంచి బెల్జియం గ్లాసుతో చేసిన, అందమయిన ఫ్రేము అమర్చిన అద్దం. దాన్ని మాధురికోసమనే ముచ్చట పడి ఎక్కువ ఖరీదు ఇచ్చి కొన్నాడు ఆమె తండ్రి.

భార్యాభర్తల తొలి వలపు బులుపు తీరాక "వాళ్ళ"కి స్వాభావికమయిన అభిప్రాయభేదాలు వచ్చేయి అంత పెద్ద సమస్యలు లేవు. చిన్న చిన్నవే. తేలికగా సర్దుకుపోగలిగినవే.

కాని, ప్రతి చిన్న సమస్యకీ మాధురి చలించిపోయేవి. ఆ ప్రకంపనాలు మోహనరావునీ తాకేవి. వీలయినంత వరకు సర్దుకుపోయేవాడు మోహనరావు. బలహీనమయిన మనసు కలిగిన అంద మయిన భార్యకి తగిన మంచి భర్తలాగ ఉండటానికి ప్రయత్నించేవాడు. వీలయి నంత వరకు తన పద్ధతుల్ని మార్చుకొని ఆమెని సంతృప్తి పర్చటానికి ప్రయ త్నించాడు. అందుకు ఎంతో కృషి చేసాడు. ఆమె ఉద్దేశ్యాల్ని గమనించి అందుకు తగినట్టుగా నడిచాడు, తను.

అయినా—

ఏవో స్పర్థలు తలెత్తేవి.

కొన్ని స్వయం కల్పితాలు. మాధురి మనోజనితాలు.

అందులో, కొన్ని అతని ఓపికని పరీక్షించేవి.

అప్పు డతను ఆమెవంక తీవ్రంగా చూసేవాడు. "నీ మొహం" అని మాత్రం బయటకి వెళ్ళిపోయేవాడు కోపంగా. అప్పుడు మాధురి ఏడ్చేది. ఒంటరిగా గదిలో కూర్చుని గుబులు తీరేటట్టు ఏడ్చేది. ఏడ్చి ఏడ్చి మనసు తేలిక పడినాక మొహం కడుక్కుని తుడుచు కొని అద్దం ముందు కూర్చుని టాయిలెట్ అయేది

"నీ మొహం అంటారు. నా మొహానికేమొచ్చె !" అనుకుంటూ అందమయిన చంపల్నీ, కళ్ళనీ, ముక్కునీ, పెదాల్నీ చూసుకుని చివరికి అతనిమాట పూర్తిగా అబద్ధమే అని తేల్చుకుని సంతృప్తి పడేది. అతను ఇంటికి తిరిగి వచ్చేసరికి చిరునవ్వుతో స్వాగతం ఇచ్చేది. అంతా మర్చిపోయి ఇద్దరూ మంచి భార్యాభర్తలుగా మసలుకొనే వారు అప్పుడు.

ఇది ఒకనాటిది కాదు. ఈ పద్ధతి

ఒక్క ఏటిదీ కాదు. అలాగ ఏండ్లు గడిచిపోయేయి.

ఇప్పుడు మాధురికి ముప్పయి అయిదు వచ్చింది. ఆమె ఎవరితోనయినా అనటమైతే ముప్పయి కూడా రాలేదనే.

చిత్రంగా - రాను రాను వాళ్ళమధ్య ఘర్షణలూ తగ్గిపోయేయి ! ఇద్దరిమధ్యా అవగాహన పెరిగింది. పరస్పరం అభిమానాన్ని, గౌరవాన్ని వ్యక్తం చేసుకొనే మార్గాల్ని గురించే ఆలోచించే వారు. అందుకు కారణం ముఖ్యంగా మాధురిలో వచ్చిన మార్పే. ఇపుడు ఆమె ఆచి, తూచి మాట్లాడుతూ ఉంది గంభీరంగా, గుంభనగా ఉంటూ ఉంది. ఆమెలో వచ్చిన ఆ మార్పు ఆకస్మిక మయింది కాదు. ఆ మార్పుకి మోహన రావూ ఆశ్చర్యపోయాడు.

చిత్రంగానే ఉంటుంది. అన్న దమ్ములు ఎడమయిపోయి సంసారాలు సాగిస్తూ ఉన్నారని దిగు లన్పిస్తుంది. వేరుబాట్లు తెచ్చిపెట్టూ, కొత్త కొత్త కలయికల్ని, అనుబంధాల్ని తెస్తూ కాలం ఇంత త్వరగా పరుగెడుతుందా అన్న ఆలోచనా వస్తుంది. అంతా నిన్నగాక మొన్న జరిగినట్టు అన్పిస్తుంది గాని అప్పుడే ముప్పయ్యయిదేళ్ళు గిర్రున తిరిగిపోయాయా అని గుబులు గుబులుగానే అవుతుంది. ఈ కాలమే తన తల్లిదండ్రుల్ని మింగిందని గుర్తు వచ్చి భయమూ కలుగుతుంది.

ఇపుడు 'వాళ్ళ'కి ఒకే కూతురు పేరు సబిత. ఆ అమ్మాయి మాధురి అందమూ, మోహనరావు స్వభావమూ పుణికి పుచ్చుకుంది. ఆమె ఇపుడు భర్తతో న్యూఢిల్లీలో ఉంటూంది. వాళ్ళకి ఒక బాబు. భర్త సెంట్రల్ గవర్నమెంటులో పెద్ద ఆఫీసరు.

ఈ రోజు మోహనరావు కాలేజికి వెళ్ళాక సబిత రాసిన ఉత్తరం వచ్చింది; దాంతో కొన్ని ఫొటోలూ పంపింది. అంతా తన సంసారం గురించీ, భర్త మంచితనాన్ని గురించీ కొడుకు అల్లరి గురించీ ! — బోరనిపించింది. చూసి చూసి ఆ ఫొటోల్ని మరల కవరులో పెట్టి టేబులుమీదకి విసిరేసింది — మాధురి.


ఆమె మనసు మోహనరావువైపు లాగింది. ఈయనింకా రాలేదు అని పదే పదే అనుకుంది. అప్రయత్నంగానే వెళ్ళి అద్దం ముందు కూర్చుని తనని తాను చూసుకుంది. మరల మరల చూసుకుంది.

నిజమే !

ఇన్నాళ్ళుగా తను గమనిస్తూనే ఉంది. తనలో ఈ మార్పులు క్రమ క్రమంగానే వచ్చాయి.

తన చెంపలు నిగారింపు పోయి వెల వెల పోతున్నాయి.

శరీరం నునుపు తగ్గి, సన్నని పగుళ్ళు తొంగిచూస్తున్నాయి.



కళ్ళచుట్టూ గీతలు ఏర్పడి లోతుకు పోయి నట్లనిపించి అందవిహీనంగా అయినట్లుంది. గుండెల్లో గుబులు తొంగి చూస్తుంది.

ఇన్నాళ్ళు-అప్పుడప్పుడూ ఆ ఒక్కో మార్పూ గమనించింది మాధురి; భయ కంపితురాలయింది. ఎంతో బాధపడి నిస్సహాయురాలుగానే మిగిలిపోయింది.

ఇప్పుడు— మరో కొత్త మార్పు! పులిమీద పుట్రలాగ ఇవేమిటి ఇలాగ వచ్చి పడుతున్నాయి? ఆమె భయంతో వణికిపోయింది. దీనంగా దిగులుతో క్రుంగిపోయింది.

చెవులపైన జుత్తులోంచి తొంగి చూసిన ఆపలిత కేశం ఆమెలో మిగిలి ఉన్న అహాన్ని పూర్తిగా అణగ ద్రొక్కింది. ఆమె విలపించింది. మనసు లోపలి పొరలు ఆక్రోశంతో అల్ల

లాడాయి. అలా చాలాసేపు గడిచింది; గుండెలు తేలికయ్యాక – చివ్వున అక్కడినుంచి లేచి ముక్కు చీదుకుని బాత్‌రూంలోకి వెళ్ళింది మాధురి. మొహం కడుక్కొని తల దువ్వుకొంది. వంటగదిలోకి వెళ్ళి స్వయంగా కాఫీ కలిపింది, భర్తకని. ఆ క్షణాన ఆమెకి భర్తమీద ప్రేమ అప్రయత్నంగానే పొంగి వచ్చింది. ఆమె హాల్లో కొచ్చే టప్పటికి అప్పుడే వచ్చి కూర్చుని బూట్లు విప్పుకొంటున్నాడు అతను.

ఆమె అందించిన కాఫీ అందుకొని "వంటవాడు రాలేదా ?" అని అడిగాడు అతను. మాధురి చిరునవ్వు నవ్వి "ఉన్నాడు" అని సిగ్గుపడి తల వాల్చింది. ఆమె అభిప్రాయం గమనించి అతను చిరునవ్వు నవ్వాడు. ఈ మధ్యన ఆమెలో వస్తూ ఉన్న అటువంటి ఎన్నో మార్పులు అతను గమనిస్తున్నాడు అవన్నీ అతనికి ఎంతో సంతోషాన్నీ, తృప్తినీ ఇవ్వటమేగాక ఆమెమీద అతని ఆరాధనాభావాన్ని ఇనుమడింప చేసాయి.

పనివాళ్ళతో చెప్పి, 'లాన్' లో కుర్చీలు ఆమే వేయించింది; అప్పటికే. ఇద్దరూ కూర్చున్నాక ఆమె అతనికి 'సవిత ఉత్తరం', ఫొటోలు చూపించింది. అవి చూసి అతను ఎంతో ఆనందించేడు. "గుడ్. వెరీగుడ్" అంటూ ఆనందాన్నీ, సంతృప్తినీ వెల్లడించాడు; మాధురి దిగులుగా మొహం పెట్టింది.

"ఏం అలా ఉన్నావు ? ఒంట్లో బావుండలేదా ?" అన్నాడతను ఆతృతగా ఆమెని గమనించి.

"నో. నో – అయామ్ఆల్‌రైట్," అంది మాధురి. అతను పేపరులో మునిగిపోయాడు. కాసేపు అతన్ని చదువుకోనిచ్చి, "మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. ఏం అనుకోకూడదు" అంది.

అతను పేపర్లోంచి తలెత్తి చిత్రంగా చూసాడు, ఆమెవంక.


"నిజం చెప్పండి. ఇప్పుడు నేను అంత అందంగా లేనుగదూ ! మీ మనస్సుని అంతగా ఆకర్షించలేక పోతున్నాను గదూ ?" అంది, అతని మొహంలోకి తదేకంగా చూస్తూ, మాధురి.

"ఎవరన్నా రా మాట?!" అన్నాడు అతను ఆశ్చర్యంగా.

"ఎవరంటే ఏంటే. మీ కేమన్పిస్తుంది చెప్పండి ?"

"అయితే విను. నిజమే చెప్తున్నాను. రోజు రోజుకీ నీ అందం మరింత ఎక్కువ అవుతోంది – నన్ను గాలం వేసి, పట్టి లాగి బంధిస్తూ ఉంది, సుమా" అన్నాడు మోహనరావు.

"అంతా అబద్ధం – నా కోసమని" అంది కోపంగా పెదాలు బిగించి.



"నో. నో. నేను త్రికరణశుద్ధిగానే నిజం చెప్తున్నాను" అన్నాడు ప్రేమగా చూస్తూ.

"సర్లెండి అద్దం అబద్ధమాడదుగా. మీ అబద్ధాలతో నన్ను ఉబ్బెయ్యకండి. నా చెంపలు పల్చబడ్డాయి. కళ్ళచుట్టూ గీతలు వచ్చి చేరాయి. నిగారింపూ పోయింది ఇపుడు ఒకటి, రెండు తెల్ల వెంట్రుకలు కూడా నా జుత్తులోంచి తొంగిచూసి నన్ను భయపెడ్తున్నాయి – నిజం చెప్పండి ఇపుడయినా ..." దీనంగా అంది ఆమె. ఏడుపే మిగిలింది.

"మైడియర్ మాధురీ. నేను చెప్తూ ఉన్నది నీవన్న ఆ సంగతే కాదు. కాలంతోపాటు వచ్చే ఆ మార్పుల్ని ఎవరూ ఆపలేరు. నేననేది రోజు రోజుకీ అందం పుంజుకుంటున్న నీలోని నిన్ను గురించి. ఇపుడు నా కేమనిపిస్తుందో తెలుసా? గలగల పరవళ్ళు, ఉరవళ్లతో కొండలమధ్యనుంచి విసురుగా ఎగసిపడి ఇపుడు ఆ స్థితిని, గడిచి మైదానాల్లోంచి గంభీరంగా నడుస్తున్న నదీదేవత నా మాధురి – అని ... మాధురీ ... మాధుర్యపూరితమయిన ఇటువంటి నీ సాహచర్యం నిజంగానే నన్ను నీతో దృఢంగా బంధించివేస్తూ ఉంది. అర్థంకాలేదా? నన్ను నమ్మవా?" అన్నాడతను.

అది గ్రహించి ఆమె గభాల్న అతని పాదాలవద్ద నేలమీద కూర్చుంది. బేలయై పసిపిల్లవలె అతన్ని చూసింది. ఆమె చుట్టూ చేతులు వేసి పెనవేసి లేవనెత్తేడు అతను.

ఆ కౌగిట్లో కరిగిపోయి తనని తాను అతనికి సమర్పించుకుంది మౌనంగా మాధురి. ఆ భావనతో - తన అందం మరింతగా పెరిగినట్లు అన్పించి పారవశ్యంలో మునిగిపోయింది ఆమె. ఆ అవగాహనలో కొత్త వెల్లువ తొంగి చూసి, నూతన భావనతో ఇద్దరూ ఆనందంలో మునిగిపోయారు.